క్లుప్తంగా

మానవత సేవలు విస్తరిస్తాం



మానవతా మండల అధ్యక్షుడు వేణుగోపాల్ తిలక్‌ను సత్కరిస్తున్న శ్రీను, రంగారావు

దెందులూరు: మానవత సంస్థ సేవలను క్షేత్ర స్థాయిలో విస్తరిస్తామని సంస్థ దెందులూరు మండల అధ్యక్షుడు సంపంగి వేణుగోపాల్ తిలక్ అన్నారు. ఇప్పటికే దెందులూరు మండలంలో మానవతా సంస్థలో లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వాల నమోదు, శాంతి రథం, స్టీల్ పాడె దాతల నుంచి సేకరించామన్నారు. విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో మానవతా జిల్లా వ్యాప్తంగా విశిష్ట సేవలందిస్తోందన్నారు. ఈ ఏడాది మరిన్ని నూతన ప్రణాళికలతో సేవలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు తిలక్‌ను దాసే శ్రీను, రంగారావు, గ్రామస్తులు, మానవతా సంస్థ సభ్యులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ప్రజలంతా శాంతియుతంగా జీవించాలి



సోమవరప్పాడులో స్థానికులతో మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య

దెందులూరు: ప్రతి ఒక్కరూ సోదరభావంతో శాంతియుతంగా జీవించాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. బుధవారం సోమవరప్పాడులో పోలీస్ పికెటింగ్‌ను ఆయన పరిశీలించారు. పోలీస్ పికెటింగ్ వద్ద ఉన్న స్థానికులతో డీఎస్పీ మాట్లాడారు. వివాదాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, ఎవరి పనులు వారు చేసుకుంటూ శాంతిభద్రతల అమలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుని గ్రామాల్లో సమస్యలు సృష్టించినా, గొడవలు, అల్లర్లకు పాల్పడినా ప్రోత్సహించినా అటువంటివారిపై కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్, దెందులూరు ఎస్సై కే.స్వామి, పెదపాడు ఎస్సై శుభాకర్ గ్రామస్తులతో మాట్లాడారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి



ఎంపీడీవోతో సమావేశమైన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు: నియోజకవర్గంలో రహదార్లపై గోతులు పూడ్చాలని, గోతుల్లోకి చేరిన నీటిని డ్రెయిన్‌లోకి వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులకు సూచించారు. ఉంగుటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధర్మరాజు నాలుగు మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ధర్మరాజు మాట్లాడుతూ మురుగు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు ఎప్పటికప్పుడు పూడిక తీయించాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రంథాలయంలో ఫ్యాన్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండల కేంద్రమైన పెదవేగి గ్రంథాలయంలో పాఠకులు కూర్చోవడానికి కుర్చీలు, వెలుతురు కోసం ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు. గ్రంథాలయంలో మూడు కుర్చీలకు వైర్లు తెగిపోయి నిరుపయోగంగా ఉన్నాయని వారన్నారు. గ్రంథాలయంలో పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

ఏపీ పీటీడీ జై భీమ్ అసోసియేషన్‌కు నూతన కమిటీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ నూతన కమిటీలు ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా తగరం రమేష్, కార్యదర్శిగా కొత్తపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పామర్తి సతీష్, జిల్లా కోశాధికారిగా ఎస్. సువాద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏలూరు డిపో శాఖకు అధ్యక్షుడిగా ఎండీ ఖాసిమ్, డిపో కార్యదర్శిగా కొత్తపల్లి బాబూరావు, కోశాధికారిగా బి.విల్సన్ రావు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. రాంబాబు, డిపో కార్యవర్గ సభ్యుడిగా డీవీ రావును ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీలు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీలను వేధించడం తగదు



దెందులూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



భీమడోలు: తహసీల్దార్ వరహాలయ్యకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దెందులూరు: కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు చేయడం, బలవంతంగా రాజీనామాలు చేయడం, సెంటర్లకు తాళాలు వేయడం తగదని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు ఎ.వి జయలక్ష్మి, కార్యదర్శి పి. భారతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనామా చేయాలని బెదిరించడం, సెంటర్లకు తాళాలు వేయడం, హెల్పర్లను మానేయాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం మానుకోకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. అంగన్‌వాడీల 9 డిమాండ్లను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ వీ.జితేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రంగమ్మ, కే.శాంతకుమారి, ఎస్.రాధిక, సాయిసుధా మాత, విజయకుమారి, శైలజ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ధర్నా

భీమడోలు: బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చే యాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, టీడీపీ కూటమి ప్రభుత్వ ఉద్యోగులపై చూపుతున్న ప్రతాపాన్ని అరికట్టాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జి.వరహాలయ్యకు వినతిపత్రం అందించారు. అక్కడ నుంచి ర్యాలీగా ఐసీడీఎస్ పీవో కార్యాలయానికి వెళ్లి పీఓకు వినతిపత్రం అందించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి మండల నాయకుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వచ్చి నెల రోజులు కాక ముందే కార్మికులకు చెల్లించే పీఎఫ్ యాజమాన్యాలు సకాలంలో చెల్లించకుంటే వారిపై వేసే జరిమానాను 25 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించి యాజమాన్యాలకు కొమ్ము కాసిందన్నారు. రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయని, వాటిని విరమించుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు జి.స్వర్ణకుమారి, నాయకులు చల్లామణి, మత్తే ప్రసాద్, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.



ఉంగుటూరు: తహసీల్దారు కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఉంగుటూరు: కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, రూ.26 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ఆందోళన చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదుకు అందజేశారు. సీఐటీయూ నాయకురాలు సుజాత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధుల కేటాయింపు పెంచాలని, స్కీం వర్కర్లకు జీతాలు పెంచాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యనభ్యసించాలి



పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు: విద్యార్థులు ప్రాథమికస్థాయి నుంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన మాట వింటూ సత్ప్రవర్తనతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సత్ప్రవర్తన, పుస్తక పఠనం, డ్రగ్స్ దుష్పలితాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేసే పనులను నిరంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

భీమడోలు: భీమడోలు విద్యుత్ ఉపకేంద్రంలో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏలూరు ఆపరేషన్ ఈఈ జేపీబీ నటరాజన్ అన్నారు. ఈ మేరకు భీమడోలులో బుధవారం రాత్రి ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తగా 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏలూరు, పెదవేగి, ద్వారకాతిరుమల, నారాయణపురం, భీమడోలు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు గురువారం నుంచి నెల రోజుల పాటు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

విలువలతో కూడిన సమాజమే లక్ష్యం



భీమడోలులో ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల నూతన అభివృద్ధి కమిటీ

భీమడోలు: విలువలతో కూడిన సమాజ స్థాపనలో మానవత సభ్యులు తమ వంతు కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాంతిరథాల చైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. భీమడోలు మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మండల నూతన అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా వట్టి సుగుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా పులఖండం మధు, వెజ్జు ఏడుకొండలు, చాత్రాతి సత్యనారాయణమూర్తి, చిలపర్తి రామారాయుడు, పోలిశెట్టి సత్యనారాయణ, పూడి శ్రీనివాసరావు, కుచ్చెర్లపాటి కృష్ణంరాజు, ఏపూరి రాంబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అప్పక రాంబాబు మాట్లాడుతూ చదువు ద్వారా సమాజంలో మార్పు వస్తుందని, విద్యార్థులు, వారి కుటుంబాల్లో చదువుకున్న ప్రాముఖ్యతను వివరించాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, పసుపులేటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం ఆదర్శనీయం

దెందులూరు: దెందులూరు గ్రామానికి చెందిన ఆర్‌టీసీ డ్రైవర్ కొలుసు వెంకట సత్యనారాయణ (బాబూరావు) మరణానంతరం మరొకరికి చూపును ప్రసాదించారని దెందులూరు మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయచౌదరి అన్నారు. బుధవారం దెందులూరులో మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బాబురావు కుటుంబ సభ్యులను కొలుసు నాని పరామర్శించారు. మరణానంతరం మరొకరికి తన ద్వారా చూపు లభించాలన్న కొలుసు సత్యనారాయణ దూరదృష్టి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆందోళన



గణపవరంలో సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద సామగ్రి తరలించకుండా అడ్డుకుంటున్న ఉద్యోగులు

గణపవరం: చేపలు, రొయ్యల మేతల తయారీ సంస్థ సీపీఎఫ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని, అప్పటి వరకూ ఫ్యాక్టరీలో సామగ్రి తరలించడానికి వీలు లేదని గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. 32వ రోజు తమ డిమాండ్స్ సాధనకు ఆందోళన చేస్తున్న సమయంలో కంపెనీలోని సామగ్రి తరలించే యత్నాలను ఉద్యోగులు అడ్డుకున్నారు. సామగ్రి తీసుకెళ్లడానికి వచ్చిన వ్యక్తులను ఫ్యాక్టరీలోకి వెళ్లకుండా నిరోధించారు. తమకు యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ ఆందోళన కొనసాగుతుందని ఉద్యోగులు ప్రకటించారు. కంపెనీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు కూడా ఆందోళనలో పాలు పంచుకున్నారు. తమకు న్యాయం చేయాలని వారు నినాదాలు చేశారు. ఆందోళన ప్రాంతానికి వచ్చిన సరిపల్లె సర్పంచ్ చనుమూరి దుర్గాభవాని, చనుమూరి శివ ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగులకు న్యాయం చేయాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్మికశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని వినతులు చేసినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. ఇంత వరకూ యాజమాన్యంలో స్పందన లేదని, అధికార యంత్రాంగా ఇప్పటికైనా పట్టించుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఐదుగురు చిన్నారులకు పాఠశాల ప్రవేశాలు



పాఠశాలలో ఐదుగురు బాలబాలికలకు ప్రవేశపత్రాలు అందజేస్తున్న ఎంఈఓలు ప్రసాద్, అన్నమ్మ

దెందులూరు: స్పెషల్ డ్రైవ్‌లో దోసపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత ఆ గ్రామానికి చేపల చెరువు వద్ద కాపలా ఉంటున్న కుటుంబాల వద్దకు వెళ్లి చేసిన పరిశీలించగా ఐదుగురు చదువుకు దూరమైన చిన్నారులు ఆకుమర్తి శిరిష, ఆకుమర్తి మేరి, ఆకుమర్తి నవ్య, ఆకుమర్తి కిరణ్‌కుమార్, ఆకుమర్తి నాగేంద్రను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు కూడా ఆ కుటుంబాలకు లేకపోవడం బాధాకరమని ఎంఈవోలు ప్రసాద్ అన్నమ్మ అన్నారు. హెచ్‌ఎం స్వర్ణలత మహిళ అయినప్పటికీ స్పెషల్ డ్రైవ్‌ను చిత్తశుద్ధితో నిర్వహించడం అభినందించదగ్గ విషయమని వారన్నారు. బుధవారం సర్పంచ్ జీ.ఏసమ్మ, మాజీ సర్పంచ్ గంగరాజు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు భాస్కర్ ప్రవేశపత్రాలను విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. హెచ్‌ఎం స్వర్ణలతను ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సేంద్రియ, జీవన ఎరువులు వినియోగించాలి

పెదపాడు: వ్యవసాయంలో రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టరు ఫణికుమార్, ఉషాకుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో వ్యవసాయం చేసే విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక (ఆత్మ) శాస్త్రవేత్తలు డాక్టరు ఫణికుమార్ ఉషాకుమారి, మాజీ జెడ్పీటీసీ గారపాటి రామసీత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీతో చెట్ల తొలగింపు

దెందులూరు: పారిశుద్ధ్య పనుల్లో భాగంగా బుధవారం జేసీబీతో రోడ్డుకిరువైపులా అడ్డంకిగా ఉన్న మొక్కలు, చెట్లను, తాటి చెట్లను తొలగిస్తున్నామని సర్పంచ్ దుర్గాకుమారి రాజు అన్నారు. పంచాయతీలో శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామన్నారు. గ్రామ కార్యదర్శి, మండల ఈఓపీఆర్‌డీ పనులను పర్యవేక్షించారు.

జీతాల బకాయిలు విడుదల చేయాలి



సమగ్రశిక్ష కార్యాలయం వద్ద ప్లకార్డులతో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్ష ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని, ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంల వద్ద ఫెడరేషన్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా శాఖల ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.వినోద్ కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బావాజీ మాట్లాడుతూ ప్రతి నెలా సమయానికి వేతనాలు రాక ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి నెలా వేతనాలు వచ్చేలా ముందస్తు బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనాలు, సమ్మెలో జరిగిన ఒప్పందాల మేరకు వెంటనే సమ్మెకాలం జీతం విడుదల చేసి, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేసి ఒప్పందాల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలకు సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మినిమం టైం స్కేల్ అమలుకు చర్యలు తీసుకోవాలని, త్వరలో విడుదల కానున్న ఉపాధ్యాయ డీఎస్సీలో అర్హత కలిగిన ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని, ఉమ్మడి ఎన్నికల హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు బి.రాజ్యలక్ష్మి, కె.సోమరాజు, కె. మణికంఠ రాజు, టి.ఆనంద్ పాల్గొన్నారు.

డాగూరే సేవలు చిరస్మరణీయం



భీమడోలులో డాగూరే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

భీమడోలు: ఫొటోగ్రాఫర్ల ఆరాధ్యదైవం, ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే సేవలు చిరస్మరణీయమని భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్ అన్నారు. భీమడోలు బైపాస్ రోడ్డు వద్ద బుధవారం ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లూయిస్ డాగూరే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టూయిస్ డాగూరే, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కెమెరా సృష్టికర్త డాగూరే ప్రతి ఫొటోగ్రాఫర్‌కూ ఆరాధ్యదైవమని, మారుతున్న సమాజానికి అనుగుణంగా టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మం, నాయకులు పుల్లాబోట్ల శ్రీరామ్మూర్తి, అలజంగి రంగారావు, లీలాకృష్ణ, నరేష్; రాంబాబు పాల్గొన్నారు.

రోజుకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భీమడోలులోని 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 100 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి రోజుకు రెండు విడతల్లో విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ నెల 11 నుంచి నెల రోజులపాటు ఏలూరు, పెదవేగి, ద్వారకా తిరుమల, నారాయణపురం, భీమడోలు ప్రాంతాల్లోని వ్యవసాయ విద్యుత్‌ను రోజుకు రెండు విడతల్లో సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తం

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అతిసార వ్యాధి నిరోధానికి చర్యలు చేపట్టామని, ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని ఏలూరు తాపీ మేస్త్రీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బీ.సాయిలిఖిత తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక టైటస్ నగర్ ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధి కారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితమవుతుందని దీంతో డయేరియా, కామెర్లు, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులు, కాళ్లు పరిశుభ్రపరచుకోవాలని కోరారు.ఎవరికైనా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఉండే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తను సంప్రదించాలని చెప్పారు. స్థానిక నాయకులు బెజ్జం అచ్చాయమ్మ మాట్లాడుతూ వ్యాధులబారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రోడ్డు, డ్రెయినేజీ త్వరితగతిన నిర్మించాలి



మారుతీనగర్, మసీదు రోడ్డులో మురుగునీటి పరిస్థితిని పరిశీలిస్తున్న కోఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ వెంకటకృష్ణ తదితరులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని మారుతీనగర్, మసీదు రోడ్డులో 15 రోజుల్లోనే రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. ఏలూరు 4వ డివిజన్ మసీదు రోడ్డులో వర్షాకాలంలో రోడ్డు వర్షపునీటితో మునిగిపోతుందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేయగా, రెండు రోజుల క్రితం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఆయన మసీదు రోడ్డు పరిస్థితిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఆదేశాలతో బుధవారం ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కోఆప్షన్ సభ్యులు పెదబాబు మసీదు రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికంగా ప్రజలతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయటంతోపాటు ఒకవైపు డ్రెయినేజీ నిర్మిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో వర్షపునీరు, మురుగునీరు రోడ్డపై ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రయ్య, ఎంఈ కొండలరావు, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతీ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక నాయకులు ఉన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతోపాటు అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉండడంతో స్టాప్ డయేరియా పేరుతో చేపట్టే ప్రచార కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అప్రమత్తం చేయాలని ఏలూరు నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎం ఆర్ పెదబాబు తెలిపారు. ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన స్టాప్ డయేరియా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాధులు విజృంభించకుండా పటిష్టమైన ముందుస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అతిసార వ్యాధి నిరోధానికి ప్రజలు శుభ్రమైన, సురక్షితమైన కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజ నం చేసే ముందు సబ్బుతో చేతులను పరిశుభ్రం చేసుకోవాలని కోరారు. జూలై 1 తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, పాము శామ్యూల్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, ప్రజారోగ్య విభాగ సూపరింటిండెంట్ ఎండీ సిరాజుద్దీన్ ఉన్నారు.